## చంద్రబాబుకు నిరుపేదల పట్ల ఇసుమంతైనా ప్రేమ లేదు

:- నియోజకవర్గ ఇంచార్జ్,వైసిపి యువ నాయకుడు జయమనోజ్‌రెడ్డి



**ఆదోని,మే 21,ప్రభాతవార్త** : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు నిరుపేదల పట్ల ఇసుమంతైనా ప్రేమ లేదని నియోజకవర్గ ఇంచార్జ్,వైసిపి యువ నాయకుడు జయమనోజ్‌రెడ్డి అన్నారు. ఆదివారం వైసిపి ఆద్వ ర్యంలో పేదల పట్టాలను స్మశానంతో పోల్చిన చంద్రబాబును డౌన్ డౌన్ అంటూ నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక వైసిపి కార్యాలయం నుంచి భీమాస్ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్బంగా జయమనోజ్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు నిరుపేదలకు ఒక్క సెంటు స్థలం కూడా ఇవ్వలేదన్నారు. ఆదోని నియోజకవర్గంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి 10,090 ప్లాట్లు జగనన్న కాలనీల్లో ఇవ్వడం జరిగిందన్నారు. నిరుపేదల గుండెలను చీల్చే విధంగా పేదలకు ఇచ్చిన పట్టాలను స్మశానంతో పోల్చడం ఎంతవరకు సమంజసమన్నారు. గతంలో 2014లో చంద్రబాబు జన్మభూమి కమిటీల ద్వారా పేదల రక్తాన్ని పీల్చి పేదల జీవితాలతో ఆడుకున్న నరరూప రాక్షసుడు చంద్రబాబు అని అటువంటి చంద్రబాబుకు వయసు మీద పడి అరోమర స్థితిలో ఉన్నాడన్నారు. ఆయన వయసు అయిపోయిందని..ఫించన్ తీసుకుని ఇంట్లో కూర్చునే వయసు అయ్యిందని ఆయన వల్ల ఈ రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. రాబోవు ఎన్నికల్లో వైసిపి జెండా రెపరెపలాడుతుందన్నారు. అటు రాష్ట్రంలో,ఇటు నియోజకవర్గంలో పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు మరిన్ని సంక్షేమ పథకాలతో పాటు అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు దేవా,మున్సిపల్ చైర్మన్ బోయ శాంత,మండల యూత్ అధ్యక్షుడు ఎల్లారెడ్డి,శ్రీనివాస్‌రెడ్డి,అయ్యప్ప, దేవదాస్, ఏసేబు,సిద్ద,మల్లికార్జున,అమన్,తిక్కన్న, ఈరప్ప,గంగాధర్,శీను,మహిళానాయకురాలు శోభలత,శ్రీలక్ష్మి,శ్రీదేవి,సుగుణ,నాయకులు ఎస్‌సి సెల్ అధ్యక్షుడు చలపతి,ప్రధాన కార్యదర్శి చిన్నలాలు,వాసిం,చిన్న ఈరన్న తదితరులున్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



నందికొట్కూరు,మే 21,ప్రభాతవార్త: పట్టణ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాఘవేంద్ర(23) అనే యువకుడు మృతి చెందాడు. ఆదివారం కర్నూలు పట్టణంలోని షరీప్ నగర్‌కు చెందిన ఇద్దరు యువకులు పగిడ్యాల మండలం లక్ష్మాపురం గ్రామంలో తమ భంధువులు చేస్తున్న మైసమ్మ పూజ కార్యక్రమాన్కికి ఇద్దరు అన్నదమ్ములు రాఘవేంద్ర, మధు ద్విచక్రవాహానంపై బయలుదేరారు. పట్టణ సమీపంలో బొలోరా వాహానం వెనుక వైపు నుండి ఢీ కొనడంతో రాఘవేంద్ర అక్కడిక్కడే మృతి చెందగా మధు తీవ్రగాయాలకు గురి అయ్యాడు. వెంటనే అతనిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలిసిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

## నారాయణరెడ్డి వర్ధంతికి తరలివెళ్లిన నాయకులు



**మద్దికెర,మే 21,ప్రభాతవార్త** : వైసిపి నాయకుడు స్వర్గీయ చెరుకులపాడు నారాయణరెడ్డి మరియు సాంబశివుడుల 6వ వర్ధంతి సందర్బంగా మద్దికెరలో ఉన్న ప్రజా ప్రతినిధులు,వైసిపి నాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున చెరుకులపాడు గ్రామానికి చేరుకుని నారాయణరెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పించారు. ఈ సందర్బంగా నాయకులు మాట్లాడుతూ నారాయణరెడ్డి మద్దికెర మండలానికి ఎన్నో సేవలు చేశారన్నారు. ఏ కార్యక్రమమైనా ప్రారంభించేది మొదటగా మద్దికెర మండలం నుండే ప్రారంభించేవారన్నారు. మద్దికెర ప్రజల గుండెల్లో నిలువెత్తున నిలిచిన వ్యక్తి నారాయణరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి మురళీధర్‌రెడ్డి,రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ రేలంపాడు వెంకటేశ్వర్లు,సహకార సంఘం చైర్మన్ శాంతన్న,పంచాయతీ సలహాదారుడు ఆంజనేయులు,డిఎస్ శ్రీనివాసులు,మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ మల్లికార్జున, ఎంపిటిసిలు చిట్టి,అంజి,ముజ్జూర్ రామాంజనేయులు,కృష్ణయ్య యాదవ్,మంజునాథ్‌రెడ్డి,గంధం చంద్ర,వార్డుమెంబర్ కృష్ణ,గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఏటిఎంను ప్రారంభించిన ఎంఎల్‌ఏ




**తుంగభద్ర(మంత్రాలయం),మే 21,ప్రభాతవార్త:**మండల పరిధిలోని తుంగభద్ర గ్రామంలో ఉన్న రైల్వే స్టేషన్ సమీపంలో నూతన ఏటిఎంను ఎంఎల్‌ఏ వై.బాలనాగిరెడ్డి ఆదివారం ప్రారంభించారు.ఏటిఎంకు ప్రత్యేక పూజలు నిర్వహించి,రిబ్బన్ కత్తిరించి ఈ ఏటిఎంను ప్రారంభించారు.ఈ రైల్వే స్టేషన్ మీదుగా అనేకమంది ప్రజలు,ప్రయాణికులు,శ్రీ రాఘవేంద్రస్వామి భక్తులు ప్రయాణం చేస్తూ ఉంటారు.వీరి నగదు కష్టాలను దృష్టిలో ఉంచుకొని ఈ నూతన ఏటిఎంను అందుబాటులోని తెచ్చినట్లు ఎంఎల్‌ఏ తెలిపారు.కాబట్టి అందరూ ఈ ఏటిఎం సేవలను వినియోగించుకోవాలని ఎంఎల్‌ఏ సూచించారు.

## వేరుశనగ విత్తనాల కోసం నమోదు చేసుకోండి

**మద్దికెర,మే 21,ప్రభాతవార్త** : మద్దికెర మండలంలో ఉన్న రైతులు ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట వేయదలచుకున్న రైతులు కె6 రకం 40శాతం సబ్సీడీతో ఇవ్వడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి హేమలత తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ వేరుశనగ విత్తనాలు సబ్సీడీతో ఇవ్వడం జరుగుతుందని కావున నేటి నుండి మీ గ్రామ పరిధిలో ఉన్న రైతుభరోసా కేంద్రం నందు ప్రతిరైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రైతులు పట్టాపాస్‌పుస్తకం,ఆధార్,ఫోన్ నంబర్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. సబ్సీడీ ధరలు పూర్తి ధర రూ.9300లు కాగా 40శాతం సబ్సీడీ ధర రూ.3720లు రైతు కట్టవలసిన ధర రూ.5580లు చెల్లించాలన్నారు.

## సర్కారిసేవగా పల్లకీ ఉత్సవం



**శ్రీశైలంప్రాజెక్టు,మే21,ప్రభాతవార్త** : లోక కల్యాణం కోసం మూలనక్షత్రాన్ని దేవస్థానం ఆదివారంనాడు రాత్రి శ్రీస్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించడం జరిగింది.ఈ పల్లకీ ఉత్సవం ప్రతి ఆదివారం,పౌర్ణమి మరియు మూలా నక్షత్రం రోజులలో(సర్కారి సేవగా)జరిపించబడుతోంది.ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకలా ్యణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు.తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ జరిపించబడింది.తరువాత కార్యక్రమంల నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ జరిపించబడింది.అనంతరం శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు నిర్వహించారు.

## ముఖ్యమంత్రి జగన్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

## :- హిందూపురం ఎంపి గోరంట్ల మాధవ్



**హొళగుంద,మే 21,ప్రభాతవార్త** : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని హిందూపురం ఎంపి గోరంట్ల మాధవ్ అన్నారు. ఆదివారం హొళగుంద మండల పరిధిలోని ఎండి హళ్లి గ్రామ సర్పంచ్ సుధాకర్ సోదరుడు వివాహ కార్యక్రమానికి హిందూపురం ఎంపి కురువ గోరంట్ల మాధవ్ ముఖ్యఅతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్బంగా ఎంపి గోరంట్ల మాధవ్‌కు ఆలూరు తాలుక మాదాసి-మాదారి కురువ సంఘం నాయకులు కోగిలతోట శేషప్ప,రామ్మోహన్,పెద్దహ్యాట మల్లయ్య,బసవరాజు,రమేష్,ఎస్‌కె గిరి,పంపా,చంద్ర,లింగమూర్తి,తిప్పేష్,మరిమల్ల తదితరులు పూలమాలలతో ఎంపిని ఘనంగా సన్మానించారు.

## భక్తుల సందడితో కిక్కిరిసిన శ్రీశైలక్షేత్రం



**శ్రీశైలంప్రాజెక్టు,మే21,ప్రభాతవార్త** : అష్టదశ జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైల మహాపుణ్యక్షేత్రం ఆదివారంనాడు భక్తుల రద్దీతో క్యూలైన్లన్ని కిక్కిరిసిపోయాయి.భక్తులతోశ్రీగిరి క్షేత్రమంత జనసంధోహంతో నిండుకుంది.కాగా భక్తులు పెద్ద సంఖ్యాలో శ్రీశైలంకు తరలివచ్చారు.అదే విధంగా శ్రీశైలంకు చేరుకున్న భక్తులు ఎంతో భక్తి శ్రద్దలతో ముందుగా తమ మ్రొక్కులను తీర్చుకునేందుకు పాతళగంగలో పుణ్యస్నానాలు అచరించి తలనీలాలు సమర్పిస్తు తదుపరి శ్రీస్వామిఅమ్మవార్ల దర్శనం కోరకు క్యూలైన్ల వద్దకు చేరుకుంటున్నారు.కాగా మల్లన్న దర్శనాబాగ్యం కోరకు భక్తుల సంఖ్యా పెరగడంతో అలయంలోని క్యూలైన్లన్ని నిండిపోయాయి.ఈక్రమంలోనే దర్శనబాగ్యం కోరకు వచ్చిన భక్తులకు దేవస్థానం అదికారులు ఎటువంటి ఇబ్బందుల తలేత్తకుండా ఏర్పాట్లను చేసారు.అదే విధంగా భక్తుల ఏర్పాట్లపై దేవస్థానం కార్యనిర్వహణాదికారి ఎస్.లవన్న అదికారుల నుండి ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుంది.కాగా భక్తుల రద్దీతో పురవీదులన్ని సందడి చెస్తున్నాయి.

## వివాహ వేడుకలో కెడిసిసి బ్యాంక్

## మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి



**తుగ్గలి,మే 21,ప్రభాతవార్త** : మండల పరిధిలోని బొందిమడుగుల గ్రామంలో యస్‌ఆర్ యువసేన నాయకులు వడ్డే రంగస్వామి తమ్ముని వివాహ వేడుకలకు కెడిసిసి బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ ఎస్‌ఆర్ రామచంద్రారెడ్డి,తుగ్గలి శ్రీనివాసరెడ్డి,వైఎస్సార్ పార్టీ వైఎస్‌ఆర్ సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తుగ్గలి మోహన్‌రెడ్డి,చంద్రశేఖర్‌రెడ్డిలు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఈ వివాహ వేడుకల్లో ఎమ్మార్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల టిఎం రమేష్ మాదిగ,యువసేన నాయకులు తెలుగు శ్రీరాములు,రంగస్వామి ఆచారి,వడ్డే రమణయ్య,రాజశేఖర్,వడ్డే పులికొండ,జిల్ల సుంకన్న,గంగాధర్,విజేయుడులు ఈ పెళ్లి వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## రోడ్డు చిద్రం..ప్రయాణం నరకం..!



**హాలహర్వి,మే 21,ప్రభాతవార్త** : మండల కేంద్రమైన హాలహర్వి నుంచి మచనూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు చిద్రమైంది. ఆ రోడ్డుపై ప్రయాణం నరకంగా మారింది. నిట్రవట్టి రోడ్డు అధ్వాన్నంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆగస్టులో కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురై శిథిలావస్థకు చేరుకుంది. రోడ్డుపై మోకాలు లోతు గుంతలు కంకర తేలిపోవడంతో రోడ్డు అధ్వాన్నంగా మారింది. రోడ్డు ప్రయాణం చేయాలంటే నరకం కనిపిస్తుందని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో 3కి.మీ ప్రయాణం దాదాపు గంట సేపు పడుతుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై గుంతలు ఉండడంతో తరచు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మరమత్తులు చేయాలని పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. మండల కేంద్రమైన హాలహర్వికి రావాలంటే అర్థగేరి మీదుగా 6కి.మీలు చుట్టూ తిరిగి రావాల్సి ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమత్తులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## లక్ష్మాపురంలో మైశమ్మకు గ్రామస్తులు ప్రత్యేకపూజలు



**పగిడ్యాల, మే 21,ప్రభాతవార్త** : పగిడ్యాల మండలం లక్ష్మాపురంలో వెలసిన శ్రీమైశమ్మకు అదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు " కొలిచిన వారికి కోర్కెలు తీర్చే కొంగుబంగారం " మైశమ్మ . గత సంవత్సరం మైశమ్మ విగ్రహప్రతిష్ఠచేసిన విషయం విదితమే. అదివారం మైసమ్మ జాతరలో ముఖ్యంగా బుడగజంగాలు ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కబడుతు చెల్లించారు. గ్రామస్తులు కూడాను ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని తమ మొక్కుబడులు చెల్లించారు. ఎంఎల్‌ఏ ముఖ్యఅనుచరుడు నంద్యాల భూషిగౌడు కుటుంబసభ్యులు, కాలనీవాసులతో కలిసి ప్రత్యేకపూజలు చేసితమ మొక్కుబడులు చెల్లించినట్లు భూషిగౌడు తెలిపారు.

## రెండవ స్పెల్ ఉపాధ్యాయ

## శిక్షణ 22 నుంచి -డిఇఓ

**కర్నూలు విద్య, మే 21, ప్రభాతవార్త:** సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఇచ్చే ఇండక్షన్ ట్రైనింగ్ రెండవ స్పెల్ 22-05-2023 నుంచి 26-05-2023 వరకు జరుగుతుంది. ఈస్పెల్‌లో శిక్షణ ఇస్తున్నట్లు డిఇఓ తెలిపారు. 1998 డిఎస్సీలో ఇటీవల ఎంపికైన ఉపాధ్యాయులు, 2008 మినిమం టైం స్కేల్‌లో పనిచేస్తున్న వారు, 2018లో ఎన్నికైన ఎస్జీటిలు అందరికి సోమవారం నుండి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఈశిక్షణ సోమవారం నుండి శుక్రవారం వరకు ఐదు రోజుల పాటు జరుగుతుంది. వీరికి శిక్షణ ఇవ్వడానికి రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన 24 మంది రిసోర్స్ పర్సన్లు ఉన్నారు. శిక్షణకు కోర్స్ కో-ఆర్డినేటర్‌గా డైట్ ప్రిన్సిపాల్ వ్యవహరిస్తారు. ఎప్పటికప్పుడు నూతనత్వాన్ని నూతన టెక్నాలజిని అర్జించి వాటిని ఉపయోగిస్తు ముందుకెళ్లాలని తెలియజేస్తారు.తెలుగు ఇంగ్లీషు గణితం ఎన్విరాన్మెంట్ సైన్స్‌తో పాటు ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసి అండ్ న్యూమరసి) బాషా గణితంశాలలో పునాది వేయడం గురించి చర్చలు ఉంటాయి

## నేడు వైయస్ఆర్ సెంటనరీ హాల్‌లో స్పందన కార్యక్రమం

**నంద్యాల, మే 21, ప్రభాతవార్త:** ప్రజల నంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం పట్టణంలోని వైయస్ఆర్ సెంటనరీ హాల్‌లో స్పందన కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టరు డా.మనజీర్‌జిలాని సమూన్ ఆదివారం తెలిపారు. స్పందన కార్యక్రమానికి ఉదయం 9.30 గంటలకు జిల్లా అధికారులందరు హాజరు కావాలని కలెక్టరు తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల,నియోజకవర్గ, డివిజన్‌స్థాయిలో కూడ యధాతదంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టరు తెలిపారు. స్పందన కార్యక్రమంలో గత వారం నుంచి వినూత్న రీతిలో ప్రత్యేక చర్యలు చేపట్టామని ఇందకు అనుగుణంగా అధికారులు వ్యవహారించాలని ఆయన అదేశించారు.

## జగనన్న అణిముత్యాలు కార్యక్రమం అట్టహాసంగా

## జరపండి -జిల్లా విద్యాశాఖాధికారి

**కర్నూలు విద్య,మే 21, ప్రభాతవార్త:** పదవతరగతి, ఇంటర్ మీడియట్‌లలో నియోజకవర్గస్థాయి, జిల్లాస్థాయిలో అత్యధిక మార్కులు సంపాదించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్నట్లు డిఇఓ తెలిపారు. కార్యక్రమాన్ని నియోజకవర్గస్థాయిలో 25న జిల్లాస్థాయిలో 27న జరుపుతారన్నారు. నియోజకవర్గస్థాయిలో నియోజకవర్గపు శాసన సభ్యులు ముఖ్య అతిథులుగా ఉంటారు. ఫెసిలిటేషన్ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించాలి. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులను, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయున్ని సన్మానించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథి ఎమ్మెల్యే, ఎమ్మెల్యే గారికి ముందుగానే విషయం తెలిపి ఆయన యొక్క అనుమతి తీసుకోవాలి. స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధులను కూడ ఆహ్వానించాలి.సమీపంలో ఉండే విద్యార్థులను కూడ ఆహ్వానించాలి. నియోజకవర్గస్థాయిలో పదవ తరగతి విద్యార్థులకు మూడు ప్రైజ్‌లుంటాయి. మొదటి బహుమతి రూ.15 వేలు, రెండవ బహుమతి 10,000, మూడవ బహుమతి రూ.5000లు ఇంటర్మీడియట్ వారికి రూ.15 వేల చొప్పున నలుగురికి ఇస్తారు. ఇందులో ఎంపిసి, బైపీసి, హెచ్ఈసి, సిఇసి వారు ఉంటారు. జిల్లాస్థాయిలో పదవ తరగతి వారికి రూ.50,000లు, మొదటి బహుమతి రూ.30,000లు, రెండవ బహుమతి రూ.15,000లు, మూడవ బహుమతి ఇస్తారు. ఇంటర్ వారికి రూ.50,000లు నాలుగు గ్రూప్‌లతో నలుగురికి ఇస్తారు. జిల్లాస్థాయిఓ మొదటి స్థానంలో ఉన్నవారు దండి అభయ్ చరణ్, జడ్‌పిహెచ్ఎస్ సంతగూడురు అదోని మార్కులు 588, రెండవ స్థానంలో వున్నవారు ఈడిగే గణేష్ ఎంజెపి ఏపీ బిసీ వేల్ఫేర్ గోనెగండ్ల 586, రెండవస్థానంలోనే మరో విద్యార్థి సుస్మీత ఏపీ అబ్దుల్ కలాం మున్సిపల్ స్కూల్ 586, మూడవ స్థానంలో గుడిసె మనోహార్ ఎంజెపి ఏపీ గోనెగండ్ల 584 మార్కులు సాధించారు.

## పల్లెటూరి విద్యార్థికి పి హెచ్ డి డాక్టరేట్ అవార్డు

**నందవరం,మే 21, ప్రభాతవార్త:** ఓ మారుమూల పల్లెటూరులో జన్మించి ఆంధ్రయూనివర్శిటి కళాశాలలో పిహెచ్‌డి డాక్టరేట్ అవార్డు విశాఖపట్నంలో అందుకున్నారు. నందవరం మండల పరిధిలోని పూలచింత గ్రామంలోని శ్రీవరబండేగురు మఠానికి చెందిన హైమావతి వీరభద్రస్వామిల కుమారుడు రాజశేఖరస్వామి దేశంలోని అత్యున్నత విశ్వవిద్యాలయాల్లో ఒక్కటైన హైదరాబాద్ కేంద్రియ విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ ఆచార్యా జర్రా అప్పారావు పర్యవేక్షణలో కర్నూలు జిల్లా కథా సాహిత్యం బహుజన జీవిత చిత్రణ అనే అంశంపై పరిశోధన చేసి విశ్వవిద్యాలయం వారికి సమర్పినందుకు విశ్వవిద్యాలయం ఉప కులపతి (వైస్ ఛాన్సలర్) ఆచార్య పి వి జి డి ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా పిహెచ్‌డి డాక్టరేట్ అవార్డు రాజశేఖర్ అందుకున్నారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది పూర్వీకులు పట్టణాలకు పల్లెటూర్లో పల్లెకొమ్మలని అనేవారు. వారు అన్నమాట నగ్నసత్యం నిజం చేసిన ఓమారుమూల పల్లెటూరులో జన్మించిన తెలుగు సాహిత్య పిహెచ్‌డి డాక్టరేట్ అవార్డు అందుకున్న రాజశేఖర్ లాంటి విద్యార్థులు అందరు ఉత్తీర్ణత సాధించాలని పల్లెటూర విలువలను కాపాడాలని, డాక్టరేట్ అవార్డు అందుకున్న సందర్బంగా ఆంధ్రవిశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ పివిజిడి ప్రసాద్‌రెడ్డి ఏయి తెలుగు శాఖాధిపతులు ఆచార్య జర్రా అప్పారావు, ఆచార్య వెలమల సీమ మ్మన్న, ఆచార్య గజ్జా యోహానుబాబు ఎం రాజశేఖరస్వామిని అభినందించారు. తనకు తన చదువుకు సహకరించిన తల్లిదండ్రులు హైమావతి వీరభద్రస్వామిలకు ఆయన సతీమణి గాయత్రికి తన కుటుంబ సభ్యులైన భవాని మల్లిఖార్జునస్వామి, జ్యోతి సిద్దులకు తన పెద్దనాన్న మఠం శంకరయ్యస్వామి తన అన్నయ్య బండేగురు స్వాములకు రాజశేఖర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీగిరిలో సాంస్కృతిక కార్యక్రమాలు

**శ్రీశైలంప్రాజెక్టు,మే21,ప్రభాతవార్త** : శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా(నిత్య కళారాధన కార్యక్రమంలో బాగంగా)ఆదివారంనాడు ఎ.అరుణకుమారి మరియు వారి బృందం గుంటూరు వారిచే భజన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.కాగా ఆలయ దక్షిణ మాడవీదిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సాయంకాలం నుండి ఈ భజన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో శ్రీ గణనాయక,శ్రీరామలింగేశ్వర,కైలాసగిరిపై కొలువైన స్వామి,జయహే కైలాసవాసా ,శ్రీశైలేశ్వరా, మొదలైన భక్తి గీతాలు,అష్టకాలను ఆళ్ల శ్రీనివాసరెడ్డి,అరుణకుమారి,విజ యలక్ష్మి,సాంమ్రాజ్యం,పద్మ,మున్నంగిరాద,వెంకటలక్ష్మి,సాంబయ్య తదితరులు అలాపించారు.ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజు సంప్రదాయనృత్యం,వాయిద్య సంగీతం,భక్తి రంజిని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్ని పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ ధర్మపథం కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

## ఉరుములు,మెరుపులతో వృషభం మృతి

**మద్దికెర,మే 21,ప్రభాతవార్త** : మండల పరిధిలోని ఎం అగ్రహారం గ్రామంలో ఆదివారం ఉరుములు,మెరుపులతో వర్షం కురిసింది. అయితే రైతు బండారు లక్ష్మన్న పొలం పనులు ముగించుకుని ఇంటి దగ్గర వృషభాలను కట్టి వేయడం జరిగింది. ఆకస్మికంగా వర్షం కురవడంతో ఉన్నపాటుగా అక్కడే ఉన్న ఒక వృషభం ఉరుములు,మెరుపుల దాటికి ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందడం జరిగింది. ఈమద్య కాలంలో లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన వృషభాలలో ఒక వృషభం మృతి చెందడంతో రైతుకు తీవ్ర నష్టం వాటిల్లిందని ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

## బీసీ ఫెడరేషన్ డివిజన్ కార్యాలయం ప్రారంభం



ఆదోనిలీగల్, మే21, ప్రభాతవార్త ; ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరినాయుడు అధ్యక్షతన ఆదివారం నూతన కార్యాలయా న్ని ప్రముఖ పారిశ్రామికవేత్త విట్టా రమేష్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విట్టా రమేష్ మాట్లడుతూ బీసీ ఫెడరేషన్ ఐక్యమత్యంతో ముందుకు అడుగులు వేయాలన్నారు. బీసీ కుల సమస్యలను పరిష్కరించుకోవాలని, బీసీ హక్కులను సాధించుకునేందుకు ఐక్యమత్యంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరినాయుడు మాట్లడూ ఆదోనిలో గత 15 సంవత్సరాల నుంచి బీసీల సమస్యలు పరిష్కారం కోసం బీసీ కార్యాలయం లేదని, ఈ బీసీ ఫెడరేషన్ కార్యాలయం ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కావునా బీసీ కుల సంఘాల నాయకులు ఐక్యమత్యంతో ప్రతిఒక్కరూ రాజకీయంగా ఎదగాలన్నారు. రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీల్లోబీసీ కులాల వారు శాసనసభ్యులుగా పోటీకి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులు మాన్వి దేవేంద్రప్ప, గౌరవ సలహాదారులు ధణాపురం శేషన్న, దేవిశెట్టి ప్రకాష్, తాలూకా అధ్యక్షులు మారియాని చెన్నబసవ, జనరల్ సెక్రటరీ రమేష్ ఆచారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.షేక్షావలి, గౌరవ సలహాదారులు బండ రాజేశ్వరరావు, కపటి వీరభద్ర, పట్టణ ఉపాధ్యక్షులు వడ్డే శ్రీనివాసులు, బి.రాముడు, డి.శ్రీనివాసులు, నాగార్జున, బీసీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ప్రధాని వర్ధంతి వేడుకలు

**ఆదోనిలీగల్, మే21, ప్రభాతవార్త ;** భారతదేశ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతి వేడుకలను ఆదివారం ఆదోని మైనార్టీ కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదోని నియోజకవ్ర ఇన్‌చార్జి దేవిశెట్టి ప్రకాష్, కర్నూలు జిల్లా మైనార్టీ చైర్మన్ ఎండి ఊర్ మాట్లాడుతూ భారతదేశం సాంకేతికంగా ప్రపంచ దేశాలకు సమానంగా దూసుకుపోతుందంటే దానికి కారణం ఈ రాజీవ్‌గాంధీ అని చెప్పారు. ఆరోజుల్లో ఆయన ప్రవేశపెట్టిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వల్లే ఇది సాధ్యపడిందన్నారు. అదేవిధంగా భారతదేశ యువతీ, యువకులకు 21 సంవత్సరాలకు ఉండే ఓటుహక్కును 18 సంవత్సరాలు చేసి దేశంలో అందరికీ ఓటు హక్కు ఉండాలని భావించిన వ్యక్తి అని చెప్పారు. చిన్న వయస్సులోనే భారతదేశ ప్రధానిగా పదవి చేపట్టి దేశాన్ని అభివృద్ధిలో నడిపించారన్నారు. అలాగే ఇటీవల కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రిగా డి.కె.శివకుమార్ ప్రమాణస్వీకారం చేసినందుకు, మంత్రులుగా మరి కొంతమంది ప్రమాణ స్వీకారం చేసినందుకు వారందరికీ ఆదోని కాంగ్రెస్ పార్టీ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు బి.తాయన్న, ఐఎన్‌టీసీ జిల్లా ఉపాధ్యక్షులు జయరామ్, ఆదోని మైనార్టీ ఉపాధ్యక్షులు హుసేన్‌బాషా, మండలాధ్యక్షుడు హనుమంతు, మండల ఉపాధ్యక్షులు కుప్పగల్ అయ్యప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

గడివేముల, మే21, ప్రభాతవార్త : విద్యార్థినీ, విద్యార్థులు వేసవి సెలవుల్లో గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయాధికారి వి.వెంకటేశ్వరరెడ్డి సూచించారు. ఆవాఆరం వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ముఖ్య అతిథిగా హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం దస్తగిరమ్మ సమ్మర్ క్యాంపులో పాల్గొన్నారు. స్థానిక గ్రంథాలయంలో పుస్తక పఠనం, జాతీయ నాయకుల కథలు తెలియజేసి, పిల్లలతో కథలు చదివించారు. చిన్నతనం నుంచే గ్రంథాలయాలకు వెళ్లడం అక్కడున్న పుస్తకాలను చదవడం వల్ల జ్ఞానం పెరుగుతుందని విద్యార్థినీ, విద్యార్థులకు తెలియజేశారు.

## యువగళం పాదయాత్రను జయప్రదం చేయండి

**చాగలమర్రి,మే21,ప్రభాతవార్త:** ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఈనెల 22,23వ తేదిల్లో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు శేఖర్‌రెడ్డి కోరారు.ఆదివారం ఆయన మండలంలోని గొడిగనూరు గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ నారా లోకేశ్ పాదయాత్ర 22వ తేది నుండి దొర్నిపాడు మండలం నుండి ప్రారంభమవుతుందన్నారు.23వ తేదిన చింతకుంట గ్రామం నుండి ప్రారంభమై ఆళ్లగడ్డలోని పాతబస్టాండ్‌లో బహిరంగ సభ ఉంటుందన్నారు.కావునా బహిరంగ సభకు మండలంలోని భూమా అభిమానులు,టీడీపీ నాయకులు,కార్యకర్తలు,ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శేఖర్‌రెడ్డి,రామచంద్రారెడ్డి ,రామసుబ్బయ్య, కృష్ణ,శ్రీరాములు,బాబయ్య,నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## చినుకుపడితే చీకటే

**బేతంచెర్ల,మే21,ప్రభాతవార్త:** మండుటేసవిలోను అకాల వర్షాలు కురుస్తుండడంతో చినుకు ప్రారంభమయ్యేలోగానే కరెంట్ కట్ అయి చీకటి నెలకొంటుందని దీంతో ఉక్కపోతతో అల్లాడిపోతున్నామని మండల ప్రజలు వాపోతున్నారు.అకాల వర్షాలు ప్రారంభమయ్యేలోగానే చిన్నపాటి గాలులు,వడగాళ్ళ మొదలైతేనే విద్యుత్ సరఫరా ఆగిపోతుంది.నిన్నటి వరకు వైశాఖమాసంలో ఎండలు అధికంగా ఉండడంతో భూమి వేడెక్కింది.దీంతో చిన్నపాటి వర్షం కురిసినా వేడి పొగలు కక్కుతూ బయటకు వస్తుంది.వర్షం మొదలైనప్పటి నుంచి విద్యుత్ సరఫరాలేక ఉక్కపోతకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.దీనికి తోడు వర్షం కురవడం ఆగిపోయినా గంటలపాటు విద్యుత్ సరఫరా జరగకపోవడంతో భూమి పై ఉన్న వేడితో ఉక్కపోత అధికమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రాత్రి వేళల్లో విద్యుత్ అంతరాయం వల్ల వర్షాల కారణంగా వేడికి తట్టుకోలేక పాములు,తేళ్ళు బహిరంగ ప్రదేశాలకు వస్తుండడంతో కాలినడకన వెళ్లే ప్రజలు ఎక్కడవాటి కాటుకు గురవుతామోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మరికొంత మంది సంచార జీవనం చేసే ప్రజలు వారి గుడిసెల్లోకి ఎలాంటి విషసర్పాలు,తేళ్ళు చొరబడుతాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఎలాంటి కారణాలు లేకుండానే విద్యుత్ అంతరాయం జరుగుతుండడంతో ప్రజలు,సెలవుల కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.మండలంలో ఎప్పుడులేని విధంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం జరుగుతుండడంతో మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.చిన్నపాటి వర్షాన్ని సాకుగా చూపి సిబ్బందే విద్యుత్ సరఫరాను ఆపివేస్తున్నారా లేక అంతరాయం పై నుండే జరుగుతుందా అన్న అనుమానాలు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.ఏది ఏమైనా విద్యుత్ అధికారులు ప్రజా జీవనంలో కీలకపాత్ర వహిస్తున్న విద్యుత్‌ను సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వీడి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తూ సరఫరాను సక్రమంగా అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## దేశభక్తి వీరులను స్మరించుకోవాలి

**వెల్దుర్తి,మే21,ప్రభాతవార్త :** దేశభక్తి వీరులను స్మరించుకోవాలని గ్రంథాలయాధికారిణి కవితబాయి అన్నారు.సానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా విద్యార్థులతో ఆమె దేశభక్తి వీరుల జీవితగాథలను చదివించారు.వారు దేశంకోసం ఎన్నో బలిదానాలు చేశారని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు ఉద్యమనేత కొల్లి నాగేశ్వరరావు సేవలు మరువలేనివి

**వెల్దుర్తి,మే21,ప్రభాతవార్త :** రైతు ఉద్యమనేత కొల్లి నాగేశ్వరరావు రైతులకు చేసిన సేవలు మరువలేనివని సిపిఐ,రైతుసంఘం మండల నాయకులు టి.క్రిష్ణ,బాలరాజు,డి.రాజులు అన్నారు.స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆ ఉద్యమనేత 3వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఆయన ఆశయసాధనకై ఉద్యమించాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ,రైతుసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్‌లో సత్తా చాటిన ప్యాపిలి విద్యార్థి

**ప్యాపిలి మే21(ప్రభాతవార్త):** ప్యాపిలి పట్టణంలోని హుసేనాపురం వీధికి చెందిన ఆలూరు మనోజ్‌కుమార్ పాలిటెక్నిక్ కోర్సు ప్రవేశ పరీక్షలలో సత్తా చాటినట్లు తల్లితండ్రులు ఆలూరు వంశీచౌదరి, సుహాసినిలు తెలిపారు. ఇటీవల ప్రకటించిన పాలిసెట్ ఫలితాలలో మనోజ్‌కుమార్ 120 మార్కులకు గాను 94 మార్కులను సాధించి రాష్ట్రస్థాయిలో 1526వ ర్యాంకును సాధించారు. పదవతరగతి పరీక్షలలో కూడ అత్యధిక మార్కులను సాధించి, పాలిసెట్‌లో అత్యధిక మార్కులతో అత్యుత్తమ ర్యాంకును సాధించిన మనోజ్‌కుమార్‌ను తల్లితండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ మాట్లాడుతూ ఇంజనీర్ అయి దేశానికి సేవలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.

## సిరులు కురిపిస్తున్న నల్లమట్టి..

**మునక భూముల్లో అక్రమంగా మట్టి తరలింపు**

**హెడ్‌రెగ్యులేటర్ స్టాండర్డు బ్యాంకుకు పొంచి వున్న ప్రమాదం**

**జూపాడు బంగ్లా, మే 21 ప్రభాతవార్త :** శ్రీశైలం ప్రాజెక్టు మునక భూముల్లో మట్టి అక్రమార్కులు యథేచ్ఛగా మట్టిని అక్రమంగా తరలించుకుని పోతున్నారు. వేసవి కాలంలోనే మట్టి వ్యాపారం జోరందుకోవడంతో వ్యాపారులు లక్షలాది రూపాయలు అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. పాములపాడు, ఎదురుపాడు, గుమ్మడాపురం గ్రామాలకు చెందిన ఐదు మంది రైతులకు శ్రీశైలం రిజ్వాయర్ ముంపు భూములలో మట్టి తవ్వేందుకు జలవనరుల శాఖ అధికారులు అనుమతి ఇచ్చారు. వ్యవసాయ భూముల్లో భూసారాన్ని మెరుగు పరుచుకునేందుకు కోసం రైతులు మట్టి తరలించుకునేందుకు అనుమతి ఇస్తున్నట్లు జలవనరుల శాఖ అధికారులు ఇచ్చిన ఉత్తర్వులో పేర్కొన్నారు. పాములపాడు, కొత్తపల్లి మండలాల తహశీల్దార్లు ధృవీకరించిన వ్యవసాయ భూములకు మాత్రమే మునక భూములలోని మట్టిని ఉపయోగించాల్సి వుంది. తవ్విన మట్టిని వాణిజ్య అవసరాలకు వినియోగించ రాదు. అయితే పాములపాడు మండలానికి చెందిన ఓ నాయకుడు బినామీ రైతుల పేర్ల మీద మునక భూముల్లో మట్టిని తవ్వేందుకు అనుమతులు పొంది అక్రమ మట్టి వ్యాపారానికి తెరలేపారు. పాములపాడు, కొత్తపల్లి మండలాలకు చెందిన 5మంది రైతులకు మట్టి తరలింపుకు అనుమతులు పొందినప్పటికి జూపాడుబంగ్లా మండలంలోని తరిగోపుల గ్రామానికి చెందిన రైతులకు మట్టిని విక్రయిస్తున్నారు. ఒక్కొక్క ట్రిప్పరు మట్టి వందల రూపాయలకు కొనుగోలు చేసినట్లు మట్టియ్య అనే రైతు విలేకర్లకు తెలిపారు. అదే గ్రామానికి చెందిన బాబురావు, రాధాకృష్ణ రైతులకు కూడా మట్టిని విక్రయించినట్లు మట్టయ్య తెలిపారు. ఈ మట్టి దందా గత మూడు రోజులుగా కొనసాగుతున్నప్పటికి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వేసవి కాలం కావడంతో రైతులు తమ పొలాలను చదును చేసుకుంటున్నారు. పొలాలోని గుంతలు పూడ్చుకునేందుకు మట్టి అవసరం కావడంతో మట్టి మాఫియాకు సిరులు కురిపిస్తోంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ స్టాండర్డు బ్యాంకు దగ్గరలో మట్టి తవ్వకాలు జరుగుతుండడంతో స్టాండర్డు బ్యాంకు ప్రమాదం పొంచి వుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా జల వనరుల శాఖ అధికారులు నిద్రమత్తు వీడి మట్టితరలింపుకు అనుమతి ఇచ్చిన రైతుల పొలాలకు మట్టిని తరలించే విధంగా చర్యలు చేపట్టి అక్రమ మట్టి వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

## మండ్లెంలో విద్యుత్ తీగల చోరీ

**జూపాడు బంగ్లా, మే 21 ప్రభాతవార్త :** జూపాడుబంగ్లా మండలంలోని మండ్లెం గ్రామానికి చెందిన రైతుల వ్యవసాయ విద్యుత్ మోటర్లకు అమర్చిన సర్వీసు వైర్లు గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన జిలేబి భాష,హబిబుల్లా,సలాం,శ్రీను,మాభాష, నైమత్ బాష,జంగలి మార్కండేయ, ఛాంద్‌భాష, అబ్దుల్ రహ్మాన్,శ్రీకాంత్‌లతోపాటు మరో 30 మంది రైతులకు చెందిన వ్యవసాయ బోర్ల వద్ద విద్యుత్ తీగలు చోరీ గురైనట్లు ఆదివారం రైతులు విలేకర్లకు తెలిపారు. గత రెండు రోజులు క్రితం బాదనమ్మ బావి పరిసరాలలో మండ్లెం గ్రామానికి చెందిన రైతులు వ్యవసాయ బోర్ల విద్యుత్ తీగలు గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారన్నారు. గతంలో తూడిచెర్ల గ్రామంలో తీగల చోరీకి పాల్పడుతుండగా రైతులు రెడ్‌హ్యాడెడ్‌గా దొంగలను పట్టుకుని పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. పట్టుబడ్డ ముగ్గురు దొంగల పై పోలీసులు బైండవర్ కేసు నమోదు చేసి వదిలి వేశారు. తరుచు విద్యుత్ తీగలు చోరీకి గురవుతుండడంతో రైతులు బెంబేలెత్తి పోతున్నారు. ఇటీవల కాలంలో మండలంలో దొంగతనాలు ఎక్కువతున్నా పట్టించుకునే నాథుడే లేరని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి గ్రామాల్లో రాత్రి వేళలలో పోలీసుల గస్తీ ఏర్పాటు దొంగతనాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## మందుబాబుల అడ్డాగా సచివాలయాలు

**ప్యాపిలి మే21(ప్రభాతవార్త):** గ్రామాలలో పరిపాలనను అందించడం కోసం ప్రభుత్వం సచివాలయ వ్యవస్థకు రూపకల్పన చేసింది. గ్రామ పంచాయితీ కేంద్రాలలో సచివాలయాలను ఏర్పాటు చేసింది. పరిపాలన సౌలభ్యం కోసం గ్రామాలలో సచివాలయ భవనాలను నిర్మిస్తున్నారు. సచివాలయ భవన నిర్మాణాలకు లక్షలాది రూపాయల నిధులను వ్యయం చేస్తున్నారు. ప్రభుత్వ ఆశయాలు మంచివే అయినప్పటికి ఆచరణలో మాత్రం శూన్యంగానే మిగిలిపోతున్నాయి. గ్రామ పంచాయితీలలో నిర్మిస్తున్న సచివాలయాల భవనాల నిర్మాణ పనులు అర్థాంతంగా నిలిచిపోయాయి. నిర్మాణాలు పూర్తి సచివాలయాల భవనాలు మందుబాబులకు అడ్డాగా మారిపోయాయి. ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించాల్సిన సచివాలయాల భవనాలలో మద్యం సీసాలు, గుట్కాప్యాకెట్లు, నీళ్లప్యాకెట్లతో దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. మండల కేంద్రమైన ప్యాపిలి పట్టణంలోని నిలిచిపోయిన సచివాలయ భవనంలో విచ్చలవిడిగా సాగుతున్న అసాంఘిక కార్యక్రమాలపై ప్రభాతవార్త ప్రత్యేక కథనం. మండల కేంద్రమైన ప్యాపిలి పట్టణంలోని కిందిగేరిలో ఒకటవ సచివాలయం, హెల్త్‌క్లినిక్‌లకు భవనాలను నిర్మిస్తున్నారు. భవనాల నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిపివేశారు. దీనితో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాన్ని మందుబాబులు అడ్డాగా చేసుకుని ఏకంగా బార్ అండ్ రెస్టారెంట్‌గా మార్చుకుని ఎంజాయ్ చేస్తున్నారు. అంతే కాకుండ పూర్తి కాని భవనాలను పేకాట కేంద్రాలుగా మార్చుకుని కాయ్‌కాయ్‌రాజా అంటూ పేకాట ఆడుతున్నారు. నిర్మాణాలు ఆగిపోయిన సచివాలయాలు మందుబాబులకు కాలక్షేపాన్ని అందించి మద్యపానశాలగా మారాయి. అదే విధంగా బిసి కాలనీలోని పాఠశాలలు, ఏవో కార్యాలయం మందుబాబులకు, పేకాటరాయుళ్లకు, జూదగాళ్లకు కేంద్రాలు మారడం శోచనీయం. ప్రభుత్వ ఆస్తులను, భవనాలను కాపాడాల్సిన బాధ్యత ఉన్న అధికారులు మాత్రం నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. ప్రజలకు ఉపయోగ పడాల్సిన ప్రభుత్వశాఖల కార్యాలయాలు, సచివాలయాలు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారడం దారుణం. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి సచివాలయాల భవనాలలో సాగుతున్న అసాంఘిక కార్యక్రమాలను నివారించే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

## నేటి నుంచి ఆళ్లగడ్డలో లోకేష్ పాదయాత్ర

### -టెన్షన్‌లో ఆళ్లగడ్డ ప్రాంత వాసులు

### -ఇరిగెలకు టిడిపి నుంచి ఆహ్వానం - రాజకీయాలు ఏమలుపు తిరిగేనో...

**నంద్యాల, మే 21, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లాలో టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఒకింత సంతోషంగాను, మరింత ఉద్వేగంగాను కొనసాగుతుంది. నంద్యాల నియోజకవర్గంలో ప్రవేశం అయినప్పటి నుంచి కొత్తపల్లె గ్రామం వద్ద టిడిపి నాయకులైన మాజీ మంత్రి అఖిల ప్రియ, మాజీ ఆర్‌ఐసి ఛైర్మన్ ఎవి సుబ్బారెడ్డిలు పరస్పర దాడులు, అసుపత్రులపాలు, జైలుపాలు కావడంతో టిడిపికి వున్న పరువు కాస్త గంగలో కలిసిపోయింది. నంద్యాల నియోజకవర్గంలో నాలుగు స్థంబలాట మొదలైంది. యువగళం పాదయాత్ర నారా లోకేష్ ఆదివారం 106వ రోజు బనగానపల్లె ప్రాంతంలో రాత్రి 9.50 గంటలకు ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గంలో పాదయాత్ర ప్రవేశిస్తుంది. దొర్నిపాడు శివారు ప్రాంతంలో విడిది కేంద్రంలో బస చేయనున్నారు. సోమవారం ఆళ్లగడ్డ నియోజకవర్గంలో పాదయాత్ర మొదలుకానుంది. ఇప్పటికి అఖిలప్రియ జైలు నుంచి విడుదల కాకపోవడం, ఎవి సుబ్బారెడ్డి కూతరు ఎవి జస్వంతరెడ్డి మాజీ మంత్రి అఖిలప్రియపై పరుష పదజాలంతో దూషించిన సంఘటనలున్నాయి. యువ నాయకులు భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి జస్వంత్‌రెడ్డిపై అదేపదజాలంతో కౌంటర్‌ను ఇవ్వడం జరిగింది. ఈసందర్భంలో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో రెండు వర్గాలు కొట్లాడుకుంటే మూడో వర్గానికి లాభం అన్న రితీలో ఆళ్లగడ్డ తీరు ఉంది. వైసీపీ నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డికి టిడిపి పార్టీ నుంచి ఇప్పటికే ఆహ్వానం అందింది. ఈపరిస్థితుల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో తనకున్న బలాన్ని నంద్యాల నియోజకవర్గంలోని తన అనుచర వర్గానికి గోస్పాడులోని తన వర్గానికి చెందిన సుమారు 20 వేల ఓట్ల దాక ఉంటాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈపరిస్థితుల్లో మాజీ మంత్రి అఖిలప్రియకు టిక్కెట్ ఇస్తే బిజెపి నాయకులు భూమా కిశోర్‌రెడ్డి మాజీ ఆర్‌ఐసి ఛైర్మన్ ఎవి సుబ్బారెడ్డిలు సహకరించకపోవచ్చన్న అనుమానాలు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గానికి ఇరిగెల రాంపుల్లారెడ్డికి టిడిపి టిక్కెట్ ఇచ్చి నంద్యాల నియోజకవర్గానికి భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డికి టిక్కెట్ ఇస్తే అందరు కలిసి గెలుపు సులభతరం అవుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా టిడిపి విజయం సాధించేందుకు ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదు. ఈపరిస్థితుల్లో బలమైన ఓటువర్గం ఉన్న ఇరిగెల రాంపుల్లారెడ్డిని కూడ టిడిపిలోకి తెచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయని ఇప్పటికే ఆహ్వానం అందినట్లు తెలుస్తోంది. నేటి నుంచి జరిగే ఆళ్లగడ్డ లో యువనేత లోకేష్ యువగళం పాదయాత్ర ఏమలుపులు తిరుగుతుందో సజావుగా సాగేందుకు అదిష్టానం ఏ చర్యలు తీసుకుంటుందో వేచిచూడాలి.

## చెన్నారెడ్డి మదన్‌మోహన్‌రెడ్డికి నివాళ్లు అర్పించిన భూమా

**శిరివెళ్ల,మే 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గంగవరం గ్రామానికి చెందిన మాజీ పాలసొసైటి ఛైర్మన్, చెరువు ప్రసిడెంట్ చెన్నారెడి మదన్‌మోహన్‌రెడ్డి అనారోగ్యకారణాల వల్ల మృతిచెందారు. అనేక సంవత్సరాల నుంచి భూమా కుటుంబానికి ప్రధాన అనుచరునిగా, ముఖ్య నాయకునిగా ఉంటూ మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న మదన్‌మోహన్‌రెడ్డి మృతిచెందిన వార్తను సమాచారాన్ని తెలుసుకొని తెలుగుదేశం పార్టీ యువతనేత భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా జగత్‌విఖ్యాత్‌రెడ్డి మాట్లాడుతూ మదన్‌మోహన్‌రెడ్డి మృతిచెందడం తెలుగుదేశం పార్టీకి తమ కుటుంబానికి తీరని లోటని ఆయన కుటుంబానికి దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని తాము అన్ని వేళల మదన్‌మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని పేర్కొన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువగళ పాదయాత్రకు నాలుగురోజులు విరామం

### -ఈనెల 26 నుంచి 29 వరకు బ్రేక్

**నంద్యాల విద్య, మే 21, ప్రభాతవార్త:** కర్నూలు, నంద్యాల జిల్లాల్లో జరుగుతున్న టిడిపి జాతీయ కార్యదర్శి యువ నాయకుడు నారా లోకేష్ యువగళం పాదయాత్రకు నాలుగు రోజుల పాటు విరామం ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 22 నుంచి ఆళ్లగడ్డ నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు పాదయాత్రకు అన్ని ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. ఈనెల 26వ తేది నుంచి 29వ తేది వరకు విరామం ఇవ్వనున్నారు. 26వ తేదిన కోర్టు వాయిదా నేపథ్యంలో విశాఖకు వెళ్లాల్సి ఉంది. 27,28 తేదిల్లో రాజమహేంద్రవరంలో జరగనున్న పార్టీ మహానాడు సమావేశంలో పాల్గొనేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. విశాఖ నుంచి నేరుగా రాజమండ్రి వెళ్లి అక్కడ సమావేశంలో పాల్గొంటారు. 29వ తేదిన తిరిగి రాజమండ్రి నుంచి బయలుదేరుతారు. 30వ తేది కర్నూలు జిల్లాలో తిరిగి పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు.

## దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉండాలని కోరిన వ్యక్తి రాజీవ్‌గాంధీ

### -నంద్యాల్లో రాజీవ్‌గాంధీ వేడుకలు ఘనంగా

**నంద్యాల విద్య, మే 21, ప్రభాతవార్త:** దేశభవిష్యత్తు యువత చేతిలో ఉండాలని ఓటు హక్కు కల్పించిన గొప్ప వ్యక్తి రాజీవ్‌గాంధీ అని రాజీవ్ గాంధీ రాజ్యాంగ హోదా కల్పించడం ద్వారా పంచాయితీ రాజ్ సంస్థలు బలోపేతం చేశారని కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.చింతలమోహన్‌రావు పేర్కొన్నారు. ఆదివారం పొన్నాపురం కాలనీ సెంటర్‌లో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. నంద్యాల పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య అధ్యక్షతన ఈకార్యక్రమం నిర్వహించారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఉదయానే నూనెపల్లెలోని సిఎస్‌ఐ చర్చికి వెళ్లి రాజీవ్‌గాంధీ చిత్రపటంతో సంఘ పెద్దల సమక్షంలో ప్రార్థన చేయించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ చనిపోయి 32 సంవత్సరాలు అవుతున్నా ఆయన చేసిన సేవలు యావత్‌భారత దేశం గుర్తించుకుంటుందన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టి శాసన పరమైన గొప్ప మార్పులు తెచ్చారని మూడవ వంతు మహిళా ప్రతినిధులు శాసన సభలోను ఉండడం ఆయన చేసిన గొప్ప ఘనకార్యం అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని భారతదేశంలో రూపశిల్పి రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. ఆయన కన్న కళలు మనమందరం ముందుకు తీసుకెళ్లాడానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఉకొట్టు వాసు, ఎస్‌వైడి ప్రసాద్, రవిబాబు, వెంకటేశ్వర్లు, చాకలి పుల్లయ్య, శ్రీరామ్, మస్తాన్‌ఖాన్, జయలక్ష్మీ, సంపంగి రామకృష్ణ, శివరామిరెడ్డి, ఆనందరావు, రవిబాబు, పాల మాబుషా, మహిళ నాయకురాలు సరిత, సునీత, శశిరేఖ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమ్మఒడి నాల్గవ విడత అమలుకు అదేశాలు

### -75 శాతం హాజరు తప్పనిసరి, రేషన్‌కార్డు ఉండాలి

**నంద్యాల విద్య,మే 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో బడిఈడు బాలబాలికలందరికి అమ్మఒడి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన విషయం విధితమే. ఈనెల 25వ తేది నుంచి ఈనెల 29 లోపల అమ్మఒడి సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులు ఈకెవైసీ చేయించుకోవాలి. జూన్ 8వ తేదిన ప్రతిసచివాలయంలో, పాఠశాలలో తాత్కాలిక అర్హుల, అనర్హుల జాబితా విడుదల చేయబడుతుంది. పాఠశాలలు తెరిచిన మరుసటిరోజు 13వ తేది తుది జాబితా విడుదల అవుతుంది. అమ్మఒడి 2023 పథకానికి అర్హతగల విద్యార్థులు ఈకెవైసీ చేయించుకోవాలి. 2022 అక్టోబర్ నుంచి 2023 ఏప్రిల్ వరకు 75 శాతం హాజరు ఖచ్చితంగా ఉండాలి, బియ్యంకార్డు, రేషన్‌కార్డు కలిగి ఉండాలి. తల్లి మరియు విద్యార్థి ఒకే హౌస్ హోల్డ్‌మ్యాపింగ్‌లో ఉండాలి. విద్యార్థి ఈకేవైసీ చేయించాలి. 6 సంవత్సరాలు పైన ఉన్నవారికి అధార్‌సెంటర్‌లో ఫింగర్ అప్‌డేట్ చేయించాలి. ఫోన్‌నం. లింక్‌చేయాలి, ఎన్‌పిసిఐ చేయించాలి. తల్లిబ్యాంకు అకౌంట్‌కు అధార్, ఫోన్‌నం. లింక్ అయి ఉండాలి. తల్లిబ్యాంకు అకౌంట్ నం. రన్నింగ్‌లో ఉండాలి. ఈనిబంధనలన్ని మే నెలాఖరులోపల పూర్తిచేసుకొని సంబంధిత ప్రధానోపాధ్యాయులు సచివాలయంలో అప్‌డేట్‌గా చుసుకోవాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంటులు జగనన్న అమ్మఒడి ఫీల్డ్ వేరిఫికేషన్ చేయాలి. వీరు నాలుగు పాయింట్లను గుర్తించుకోవాలి. అమ్మఒడికి సంబంధించి విద్యార్థి యొక్క తల్లి అధార్ నమోదు తప్పుగా ఉంటే కరెక్టు చేయాలి. తల్లిదండ్రి లేని విద్యార్థులు గార్డియన్ హౌస్‌హోల్డ్ వేరుగా చేయాలని విద్యార్థి యొక్క అధార్ కరెక్టుగా నమోదు చేయాలి. విద్యార్థి తల్లి విద్యార్థి అధార్ వేరు వేరుగా ఉండాలి. ఒకే నంబరు ఉండకూడదు. ఈఅంశాలను వేల్ఫేర్ అసిస్టెంటులు గుర్తించుకొని అమ్మఒడి కార్యక్రమం అర్హులైన వారందరికి ఇవ్వాలని ప్రభుత్వం ప్రత్యేక అదేశాలు జారీచేసింది.

## ఇంట్లో పనిమనుషులుగా విఆర్‌ఏలను వాడుకుంటున్న అధికారిపై చర్యలు తీసుకోవాలి -విఆర్‌ఏల జిల్లా అధ్యక్షులు

**నంద్యాల,మే 21, ప్రభాతవార్త:** నంద్యాల తహాశీల్దార్ కార్యాలయంలో రెవిన్యూ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తిస్తు షోకాజ్ నోటీసుల జారీచేసిన వైనంపై రచ్చ రచ్చ కార్యక్రమం జరిగింది వివరాల్లోకి వెళ్లితే రెవిన్యూశాఖలో పనిచేసే విఆర్‌ఏలను గతంలో తలారులుగా పిలిచేవారు. వారిని ప్రభుత్వం విఆర్‌ఏలుగా పేరుమార్చింది. నంద్యాల రెవిన్యూ విఆర్‌ఎ అసోసియేషన్ అధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు నారాయణ సమక్షంన రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ధైర్యం సత్యరాజుల అధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నంద్యాల ఉప తహాశీల్దార్ రమాదేవి కోటిన్నర రూపాయలు పెట్టి ఇల్లు కట్టుకుందని ఆ ఇంటిలో పనిచేయడానికి మా విఆర్‌ఎలను తరచు వేధిస్తుందని ఆరోపించారు. అఫీసు పనులుచేయడానికి మేం ఎప్పుడు సిద్దంగాను ఉన్నామని ఇంట్లో కసులు కొట్టించుకోవడం, అంట్లుతోమడం, బండలు తుడవం వంటి కార్యక్రమాలు చేయించడం మమ్ములను హీనాతిహీనంగా చుస్తున్నారని అరోపించారు. కొందరు మహిళలకు పనులు చేయకపోవడంతో షోకాజ్ నోటీసులు జారీచేశారని నారాయణ పేర్కొన్నారు. షోకాజ్ నోటీసులకు ఏవరు భయపడరన్నారు. రమాదేవిపై ఎన్నో అరోపణలున్నాయని వీటన్నింటిని జిల్లా కలెక్టరు, జాయింట్ కలెక్టరు, ఆర్డీఓలకు ఫిర్యాదు చేస్తామన్నారు. మేం కూడ మనుష్యులమే అని మమ్ములను మానసికంగా వేధించడం తగదన్నారు. ఈవిషయాలన్నింటిని పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని జరిగిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు.

## వడగండ్ల వానతో నష్టపోయిన రైతులు

**ఉయ్యాలవాడ, మే 21, ప్రభాతవార్త:** ఉయ్యాలవాడ మండలంలో వడగండ్ల వర్షం ఆదివారం సాయంత్రం కురువడంతో రైతులు ఆరబోసిన మొక్కజొన్న తడిసి ముద్దయి భారీగా నష్టపోయామని రైతులు అవేదన చెందుతున్నారు. రూపనగుడి గ్రామానికి చెందిన రమణ అనే రైతు ఈ అకాలవర్షంతో లక్షరూపాయల వరకు నష్టపోయినట్లు వాపోయారు. అలాగే ఈగాలివర్షానికి చెట్లు విరిగిపడి, విద్యుత్ స్థంబాలు వరగడంతో దాదాపు రెండు గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. మండలంలో వరి, మిరప రైతులు కూడ నష్టపోయామని పేర్కొన్నారు.

## ఉద్యోగులను సంఘటితం చేస్తూ ఎస్సీ వర్గీకరణకు పాటుపడతాం

**వెల్దుర్తి,మే21,ప్రభాతవార్త :** మాదిగ ఉపకులాల ఉద్యోగులను సంఘటితం చేస్తూ ఎస్సీ వర్గీకరణకై పాటు పడతామని కర్నూలు జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య నూతన అధ్యక్షులు మజిల్ అలియాస మద్దిలేటి స్వామి అన్నారు.వెల్దుర్తి ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆదివారం ఆయన జాతీయ,జిల్లా,మండల నాయకులతో సమావేశం నిర్వహించారు.వెల్దుర్తి మండలం చెరుకులపాడు కొత్తూరులో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న తనపై నమ్మకంతో ఇటీవల డోన్‌కు వచ్చిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద క్రిష్ణమాదిగ తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు.ఆయన తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అహర్నిశలు వర్గీకరణకు పాటుపడతామన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు భిక్షాలు,జాతీయ నాయకులు గుండాల ఈశ్వరయ్య,జిల్లానాయకులు ఎం.బజారు,కేశవయ్య,రెడ్డిపోగు భాస్కర్,మండల అధ్యక్షులు నాయకంటి గిడ్డయ్య,నాయకులు మోష,రెడ్డిపోగు ప్రకాష్,సోమయ్య,సురేంద్ర,బజారు.పెద్దరాయుడు,దేవదానం తదితరులు పాల్గొన్నారు.

## ఈదురు గాలులకు కోల్డు స్టోరేజికి భారీ నష్టం

### - గాలి లోకి ఎగిరిన స్టోరేజి రేకులు



**కోడుమూరు, మే 21, ప్రభాతవార్త :** కోడుమూరు మండలంలోని ఆయా గ్రామాలలో ఆదివారం సాయంత్రం చెదురుమదురుగా కురిసిన వర్షంతో పాటు ఈదురు గాలులు వీచాయి. ఈ గాలులకు మండలంలోని ప్యాలకుర్తి గ్రామానికి చెందిన రంగారెడ్డికి సంబందించిన జైకిసాన్ కోల్డుస్టోరేజికి భారీగా నష్టం వాటిల్లింది. స్టోరేజి గోడౌన్‌కు వేసిన రేకులు ఎగిరి సమీప రోడ్డు మీదకు పడ్డాయి. ఒక్క సారిగా వీచిన గాలులకు స్టోరేజి గోడౌన్‌కు దాదాపు 8 లక్షల రూపాయల దాకా నష్టం వాటిల్లిందని స్టోరేజి నిర్వాహకుడు రంగారెడ్డి తెలిపారు. ఇలాగే ఆయా గ్రామాలలో మామిడి పండ్ల తోటలకు కూడా భారీగా నష్టం వాటిల్లిగా మరి కొన్ని చోట్ల చెట్లు విరిగి పడ్డాయి. గత పది రోజుల నుంచి ఉష్ణోగ్రత సగటును ప్రతి రోజు 47 డిగ్రీల వరకు ఎండ తీవ్రత పెడగడంతో జనం బయటకు రావడానికి జంకే పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే ఆదివారం సాయంత్రం కొద్ది పాటిగా వర్షం కురిసినా ఈదురు గాలులతో కొంత మేరకు ఎండ వేడిమి తగ్గినట్లైంది. ఏది ఎమైన ఈదురు గాలులకు కోల్డుస్టోరేజికి నష్టం వాటిల్లిగా, మామిడి తోడలకు కూడా భారీగా నష్టం వాటిల్లింది.

## పూర్వపు విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



**వెల్దుర్తి,మే21,ప్రభాతవార్త :** స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం 1999-2000వ సంవత్సరపు పదోతరగతి పూర్వపు విద్యార్థులు ఒక్కటయ్యారు.వారు చదువుకున్న రోజుల్లో విద్యాబుద్దులు నేర్పిన గురువులు శేషఫణిశర్మ,రఫిక్.పద్మశ్రీ,రేవతి,సంధ్యారాణి,ఫాతిమా,ఎలిజిబెత్‌లను ఆహ్వానించి శాలువ,పూలమాలలతో సన్మానించారు.ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ జీవితానికి తొలిమెట్టు విద్యార్థిదశ అన్నారు.జీవితంలో ఉన్నత ఆశయాలతో ముందుకు సాగాలన్నారు. తల్లితండ్రులను,గురువులను,పెద్దలను గౌరవించాలన్నారు.పూర్వపు విద్యార్థి నాగరాజు చనిపోవడంతో అతని కుటుంబానికి పూర్వపు విద్యార్థులు తమ వంతుగా రూ.25వేల రుపాయలు ఆర్థికసహాయంగా అందించారు.అందరు కలిసి గురవులతో సహాంపక్తి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో పూర్వపువిద్యార్థుల సంఘం నాయకులు పెద్దిగారిలక్ష్మన్న,రాముడు, శరత్‌బాబు,హరిప్రసాద్, నాగరాజు,శ్రీను,మధు నాయుడు,కిషోర్‌బాబు,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## గాలివాన భీభత్సానికి విరిగిన విద్యుత్ స్థంభం

### - తప్పిన పెను ప్రమాదం

**తుగ్గలి,మే 21,ప్రభాతవార్త :** మండల పరిధిలోని కడమకుంట్ల గ్రామ పంచాయతీలోని రోల్లపాడు తాండ గ్రామ సమీపాన గాలివాన భీభత్సానికి విద్యుత్ స్థంభం విరిగిపోయి ఒరిగిపోయింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని ఆ గ్రామ సిపిఐ నాయకుడు వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సంఘటనపై సంఘటన స్థలానికి చేరుకుని విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. స్పందించి అధికారులు విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేసి విరిగిన స్థంభం వద్ద నూతన విద్యుత్ స్థంబాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్దరించాలని కోరారు.

## యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే కాటసాని



**బనగానపల్లె,మే21,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహం నందు ఆదివారం విలేకరుల సమావేశాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ శనివారం జరిగిన నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో భాగంగా పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పై అలాగే తన పై చేసిన విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు.అదే విధంగా నియోజకవర్గం పై ఎటువంటి అవగాహన లేకపోవడంతోపాటు ఇక్కడ జరిగిన అభివృద్ధి ఏమాత్రం తెలియని నారా లోకేశ్ నా పై విమర్శలు చేయడం సరికాదన్నారు.రాష్ట్రంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పనులు రూ.40,000కోట్ల బిల్లులను తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటికి సంబంధించిన బిల్లులు చెల్లించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని గుర్తు చేశారు.అలాగే 2019 ఎన్నికల్లో గ్రామ గ్రామానా వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు తమ వంతుగా చందాలు వేసుకుని గెలిపించినటువంటి ఘనత వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలకు దక్కుతుందని,అంతటి అభిమానాన్ని సంపాదించుకున్నటువంటి వ్యక్తిగా తాను ఈ రోజు గర్వపడుతున్నానని తెలిపారు.రవ్వలకొండ పై అన్ని అనుమతులు ఉన్న కూడా బ్రహ్మంగారి గుహలకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశ్యంతోనే తనకు లీజులు ఉన్నప్పటికి కూడా మైనింగ్ ఆపివేయడం జరిగిందని తెలిపారు.అదే విధంగా ముస్లిం మైనార్టీ సోదరుల కోసం మొదటిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత ఈద్గా అన్యాక్రాంతం కాకుండా ఉండటానికి ఆనాడే రూ.30లక్షలతో ప్రహరిగోడను నిర్మించి కాపాడడం జరిగిందని తెలిపారు.అలాగే రెండవసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత మాసుంబాషా దర్గా స్మశానవాటిక అన్యాక్రాంతం కాకుండా రూ.69లక్షల నిధులతో ప్రహరిగోడ నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు.అదే విధంగా తన సొంత ఖర్చులతో షియా మతస్తులకు చెందిన ఇబాదత్ ఖానాను రూ.30లక్షలతో నూతనంగా నిర్మించడం జరుగుతుందని వాటిని కూడా త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.1.30కోట్లతో షాదిఖానా నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని త్వరలోనే పనులు మొదలుపెట్టడం జరుగుతుందని తెలిపారు.అదే విధంగా పట్టణంలోని కొండపేటలో గల వెంకటేశ్వరస్వామి ఆలయానికి టీటీడీ తరపున తాను రూ.4కోట్లు మంజూరు చేయించడం జరిగిందన్నారు.అయితే ఇంకా రూ.2కోట్లు టీటీడీ దేవస్థానం వారికి డిపాజిట్ చేస్తే వారు రూ.6కోట్లతో ఎంతో సుందరంగా వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఇందుకు వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ పర్యవేక్షణలో భక్తులచే విరాళాలు తీసుకోవడం జరుగుతుందన్నారు.వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి తన వంతుగా రూ.12లక్షలు ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందించడం జరిగిందని తెలిపారు.అంతేకాకుండా తమ కాటసాని కుటుంబ సభ్యులందరు కలిసి దాదాపుగా రూ.35లక్షలు విరాళాల రూపంలో ఇవ్వడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి,ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు,వైసీపీ యువనాయకులు కాటసాని ఓబుళరెడ్డి,అవుకు మండల వైసీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి,ఎంపిటిసి వెంకటసుబ్బమ్మ,మార్కెట్‌యార్డు ఛైర్మన్ దీవెనమ్మ,మైనార్టీ నాయకుడు అత్తార్ జాహిద్ హుస్సేన్,భానుముక్కల పరపతి సంఘం అధ్యక్షులు నీలి శ్రీనివాసులు,యాగంటిపల్లె వైసీపీ నాయకుడు బండి బ్రహ్మానందరెడ్డి,గాధంశెట్టి వేణుగోపాల్,డాక్టర్ రవికుమార్,సన్నల జనార్ధన్‌రెడ్డి,పోలూరు వెంకటకృష్ణ,జిల్లెల్ల శంకర్‌రెడ్డి,వై.మనోహర్‌రెడ్డి,యాగంటిపల్లె ప్రసాదరెడ్డి,అబ్దుల్ ఫైజ్,మాజీ ఎంపిటిసి ఈసారి ఎల్లయ్య,సైకిల్‌షాప్ మహబూబ్‌వలి,బిజనవేముల ప్రతాప్‌రెడ్డి,వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం మల్లన్న సన్నిదిలో ప్రముఖులు



**శ్రీశైలంప్రాజెక్టు,మే21,ప్రబాతవార్త :** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లను ఆదివారంనాడు బారి పరిశ్రమలశాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండ్యే,మరియు ఏపి రాష్ట్ర శాసనసభ సభపతి తమ్మినేని సీతారామ్ సతిసమేతంగా,ఇరువురు ప్రముఖులు మల్లన్న దర్శనార్థం చేరుకున్నారు.తదనంతరం ఆలయ దర్శనార్థం చేరుకున్న వారికి రాజగోపురం వద్ద ఆలయ ఏఈఓలు హరిదాసు,మొహన్‌లు,అర్చకస్వాములు సాదర స్వాగతం పలికారు.అనంతరం ఇరువురు ప్రముఖులు విడివిడిగా రత్నగర్భగణపతిస్వామి వారిని దర్శించుకున్నారు.తదుపరి శ్రీస్వామిఅమ్మవార్ల ఉభయ దేవాలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.అనంతరం అమ్మవారి ఆలయ ప్రాకార మండపంలో అర్చకస్వాములు, వేదపండింతులు వేదశీర్వాచనాలు వల్లించి తీర్థప్రసాదాలను అందించారు.తదుపరి ఆలయ ఏఈఓలు శేషవస్త్రలతో సత్కరించి లడ్డూ ప్రసాదాలను అందించి శ్రీస్వామిఅమ్మవార్ల చిత్రపటంను భహుకరించారు.

## ఘనంగా రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతి



**ఆదోని రూరల్,మే 21,ప్రభాతవార్త :** భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతి ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ భాద్యులు నీలకంతప్ప మాట్లాడుతూ దేశానికి రాజీవ్‌గాంధీ ఎనలేని సేవలు చేశారన్నారు. దేశపౌరులకు ప్రతిఒక్కరికి 18సం॥ల వయసు నిండిన వారికి ఓటు హక్కును ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీని దేశంలో మొదటిసారి తీసుకొచ్చారన్నారు. పంచాయతీరాజ్ నిధులను నేరుగా ఇవ్వడం తన పాలనలోనే జరిగిందని చెప్పారు. రాబోయే 2024ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ దిలీప్,కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాయినాథ్,యూత్ కాంగ్రెస్ నాయకులు వీరేష్,ఐఎన్‌టియుసి ఇర్ఫాన్,నిస్సార్ అహ్మద్,మద్దిలేటి,మాణిక్ రాజు,రాముడు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ సెంటు భూమి ఇచ్చి ఉమ్మడి కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాడు



**నందికొట్కూరు,మే 21,ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి తన ఓటు బ్యాంక్ కోసం జగనన్న ఇళ్ళ నిర్మాణం అంటు సెంటు భూమి ఇచ్చి ఉమ్మడి కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాడని నియోజకవర్గం టి.డి.పి.అధికార ప్రతినిధి కాకరవాడ డా.చిన్న వెంకటస్వామి అన్నారు. ఆదివారం స్తానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు టిడిపి అధినేత నారాచంద్రబాబునాయుడు ప్రజలకు ఇళ్ళు కట్టుకునేందుకు సెంట్ భూమి ఇవ్వడం వలన ఇబ్బందులు ఎదురవుతాయి కనీసం రెండు సెంట్లు అయిన ఇవ్వాలని ప్రతిపక్ష నేతగా తెలిపారు. దీనికి జవాబు చెప్పాల్సింది పోయి జగన్‌మోహన్‌రెడ్డి సిగ్గులేకుండా తన మంత్రులను, ఎమ్మేల్యేలను రోడ్డెక్కి నిరసనలు చేయండి చంద్రబాబును తిట్టండి అని ఆదేశాలు ఇవ్వడం చూస్తే పాలనపై ఆయనకు ఎంత సత్తా వుందో తేలిపోయిందని, వాస్తవాలు చెబితే జీర్ణించుకోలేని జగన్‌ను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలుగా నిరసన ఆందోళనలు చేస్తాయని, వాటికి జవాబు చెప్పుకోలేక అధికార పార్టీ రోడ్డు ఎక్కడం వింతగా ఉందని, పాలన చేత కాకపోతే తప్పుకోవాలని లేక పోతే ప్రజా కోర్టులో తేల్చుకునేందుకు ఎన్నికలకు రావాలని ఆయన సవాల్ టిడిపి నాయకులు విసిరారు. సెంటు భూమి ఇవ్వడంతో తల్లిదండ్రులను వదిలి పిల్లలు వెళ్ళిపోతున్నారని, రెండు సెంట్లు ఇస్తే అందరికి సౌలభ్యంగా ఉంటుందని మా నాయకుడు చంద్రబాబు సూచించాడన్నారు. సి.యం.గా ప్రజల మధ్యకు రాలేక పరదాల చాటున తిరుగుతు చేతకాని పాలన చేస్తు అన్ని వర్గాలను నాశనం చేస్తున్న జగన్ ప్రతిపక్షాలు వాస్తవాలు చెబితే వైకాపా ఎమ్మేల్యేలను వీధులలో తిరిగి బాబును విమర్శించండి అని చెప్పడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ప్రజలు సెంటు భూమిలో ఇల్లు కట్టుకోవాలి నీవు మాత్రం అక్రమ సంపాదనలతో నగరాలలో ఎకరాలలో వేల కోట్లతో విలాసవంతమైన ప్యాలెస్‌లు కట్టుకోవాలా అని ఆయన విమర్శించారు. నారా లోకేష్‌బాబు చేస్తున్న యువగళం పాదయాత్రకు వస్తున్న ప్రజల ఆదరణను చూసి సి.ఎం. గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయని, దానిని అడ్డుకునేందుకు జీఓ 1ని తెచ్చాడని అయితే కోర్టు చెంపపెట్టులా తీర్పు ఇచ్చిందని, నీ దోపిడి పాలన చూచి రాష్ట్రంలో ప్రజలు ఎన్నికలు ఎప్పుడు వచ్చిన నిన్ను ఇంటికి పంపేందుకు సిద్దంగా ఉన్నారని ఆయన తెలిపారు. ఇకపై మా నాయకులైన నారా చంద్రబాబునాయుడు, లోకేష్‌లపై అనుచిత వ్యాఖ్యాలు చేస్తే తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు, టిడిపి కార్యకర్తలు, ప్రజలు సిద్దంగా ఉన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చింతా వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రీయ సేద్యం..లాభదాయకం



**హాలహర్వి,మే 21,ప్రభాతవార్త :** వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే నాణ్యమైన దిగుబడి రాబట్టాలి. రైతులు రసాయనిక మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ వ్యవసాయం చేపట్టాలని వ్యవసాయ శాస్త్ర వేత్తలు,అధికారులు సూచిస్తున్నారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో రైతులు సేంద్రీయ ఎరువులపై ఆసక్తి చూపుతున్నారు. రసాయనిక ఎరువుల వాడకంతో కలుగుతున్న అనర్థాలను గుర్తించిన పలువురు రైతులు భూసారం పెంపుపై దృష్టి సారిస్తున్నారు. సేంద్రీయ ఎరువులైన పశువుల పేడ,కోడి పెంట,చీకిన గడ్డితో పాటు చెరువులు,కుంటల్లోని పూడిక మట్టిని పొలాలకు తరలిస్తున్నారు. పశు సంపద లేని రైతులు కోళ్ల ఫారాలలోని కోడిపెంట చెరువులు,కుంటలలోని పూడిక మట్టిని కొనుగోలు చేసి పొలాల్లో చల్లుతున్నారు. జూలైలో మొదటి వారం ఎల్ఎల్‌సి కాలువకు నీరు విడుదల చేస్తారు. ఖరీఫ్‌లో పంటల సాగు చేసుకు నేందుకు అనేకమంది రైతులు సేంద్రీయ సాగుకు సన్నద్ధమవుతున్నారు. సేంద్రీయ ఎరువులను పొలాల్లో చేసి కలియదున్నితే త్వరగా మట్టిలో కలిసిపోయి మంచి ఫలితాలను ఇస్తాయని రైతులు చెబుతున్నారు.

**సేంద్రీయ ఎరువులతో ఎన్నో ప్రయోజనాలు :- శివశంకర్,ఏఓ**

సేంద్రీయ ఎరువులు వాడితే ఎన్నో ప్రయోజనాలున్నాయి. పశువుల పేడ,పూడిక మట్టిని వేస్తే భూమిలో తేమ శాతం ఎక్కువ రోజులు ఉండి పంటలు ఎండిపోకుండ దోహదపడతాయి. సేంద్రీయ ఎరువులు వాడిన పొలాల్లో చీడపీడలు,తెగుళ్లు తక్కువగా ఉంటాయి. నాణ్యమైన దిగుబడి వస్తుంది.

## నేడు సోమప్ప ఆలయంలో పార్వతి,గణపతి విగ్రహాల ప్రతిష్టాపన



**ఆస్పరి,మే 21,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఆస్పరిలో స్థానిక సోమప్ప తాత ఆలయంలో నేడు సోమవారం పార్వతి,గణపతి,సుబ్రమణ్యేశ్వర స్వాముల విగ్రహ ప్రతిష్టాపన,గోపుర కలశ ప్రతిష్టాపన నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు మల్లికార్జునరెడ్డి,రామలింగారెడ్డి ,రామచంద్రారెడ్డి,బసిరెడ్డిలు తెలిపారు. శనివారం ఉదయం సోమప్ప తాత ఆలయంలో కలశ స్థాపన,గణపతి హోమం,రుద్రహోమం నిర్వహించారు. నేడు ఉదయం విగ్రహాల ప్రతిష్టాపన చేయనున్నట్లు వేదపండితులు మల్లికార్జున శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో దత్తాత్రేయరెడ్డి,గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మెగా మెడికల్ క్యాంప్‌కు అశేషమైన స్పందన

**డోన్, మే 21, ప్రభాతవార్త :** డోన్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్‌కు మునుపెన్నడూ లేనివదంగా ప్రజలనుంచి అనూహ్యమైన అశేష స్పందన లభించింది. ముందునుంచికూడా డోన్ మున్సిపల్ శాఖ ఆద్వర్యంలో పట్టణంలోని ప్రతి వార్డుల్లో సచివాలయ సిబ్బంది, హెల్త్ డిపార్ట్‌మెంట్, కౌన్సిలర్ల ద్వారా విశ్వభారతి హాస్పిటల్ మరియు వైద్యకళాశాల ఆద్వర్యంలో సంయుక్తంగా నిర్వహించే మెగా మెడికల్ క్యాంప్‌కు మంచి పేరెన్నికగన్న డాక్టర్లు, ఆదునిక వైద్య పరికరాలతో క్యాంప్‌కు హాజరవుతున్నారన్న విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయడంతో జనం వైద్యసేవలు పొందేందుకు పెద్దఎత్తున తరలివచ్చారు. ఊహించిన దానికంటే ఎక్కువగా వైద్యసేవలు పొందుకు క్యాంప్‌కు జనం హాజరవ్వడంతో ఓపి సేవల నమోదువద్ద బార్‌లైన్లను కంట్రోల్‌చేసేందుకు సైతం సచివాలయ మహిళా పోలీస్ సేవలను సైతం ఉపయోగించాల్సివచ్చింది. కర్నూలులోని ప్రముఖ వైద్యుల్లో ఒకరైన జనరల్ ఎండి వైద్యులు డాక్టర్ రవికళాదర్‌రెడ్డి సొంత ఊరు డోన్ పట్టణం కావడంతో విశ్వభారతి వైద్యశాల యాజమాన్యాన్ని ఒప్పించి మున్సిపల్ శాఖ ఆద్వర్యంలో చైర్మన్ సప్తశైల రాజేష్ సహకారంతో మెగా మెడికల్ క్యాంప్‌ను ఇంత పెద్దఎత్తున నిర్వహించారు. మెడికల్ క్యాంప్ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవ సభలో విశ్వభారతి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మరియు వైద్య కళాశాల అధినేత కాంతారెడ్డితోపాటు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, డోన్ ఎంపిపి రేగటి రాజశేఖర్‌రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ రామచంద్రుడు, ప్రముఖ వైద్యులు డాక్టర్ రవికళాదర్‌రెడ్డి తదితరులు ప్రసంగించగా కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు మల్లికార్జునరెడ్డి, ఆర్ట్ రమణ, వైకాపా పార్టీ సచివాలయాల కన్వీనర్ కురుకుంద హరిప్రకాష్, పార్టీ ప్రతినిధి కొండపేట సతీష్, వైస్ ఛైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్‌హుస్సేన్, కౌన్సిలర్లు పూజారి చలం వంశీ, టిఆర్ నగర్ వెంకటరాముడు, సిపిఐ కౌన్సిలర్ పి సుంకయ్య తదితరులు హాజరయ్యారు.

**క్యాంప్‌లో ఉచితంగా ఆధునిక వైద్యసేవలు:** మెడికల్‌క్యాంప్‌లో ఇదివరలో ఎప్పుడూ లేనివదంగా ఆదునిక సాంకేతిక పరికరాలను ఉపయోగించి హాజరైన రోగులకు ఉచితంగా వైద్యసేవలను అందించడం విశేషం. 2డి ఎకో, స్కానింగ్, ఇసిజి తదితర వైద్యసేవలను చేసేందుకు ఆధునిక వైద్య పరికరాలను సైతం ప్రత్యేకవాహనాల్లో డోన్‌కు తీసుకవచ్చి క్యాంప్‌లో పరీక్షలను నిర్వహించారు. ఇక్కడ పరీక్షించినవారికి అవసరమైతే ఆంజియోగ్రామ్‌తోపాటు ఆపరేషన్లనుకూడా ఉచితంగా కర్నూలులోని తమ జనరల్ హాస్పిటల్‌లో చేస్తామని హాస్పిటల్ అధినేత కాంతారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ చెప్పారు. క్యాంప్‌కు హాజరైన 33మంది ప్రముఖ డాక్టర్లు:




మెగా మెడికల్ క్యాంప్‌కు కర్నూలు నగరంలో ప్రముఖ వైద్యులుగా పేరొందిన డాక్టర్లు దాదాపు 33మంది హాజరయ్యారు. ప్రధానంగా హార్ట్, న్యూరాలజీ, అప్తామన్, ఆర్థో, అప్తాలమీ, గైనేకాలజీ తదితర ప్రత్యేక శాఖలతోపాటు జనరల్ వైద్యాన్నికూడా అందించే డాక్టర్లు హాజరైన రోగులకు పరీక్షలను నిర్వహించారు. ఉదయం 8గంటలనుంచి సాయంత్రం పొద్దుపోయేదాకా క్యాంప్ విజయవంతగా నిర్వహించబడింది. అవసరమైనవారికి ఉచితంగా మందులను సైతం ఉచితంగానే అందజేసారు. అంతేగాకుండా పరీక్షల్లో ఆపరేషన్లు అవసరమైతే వారికికూడా ఉచితంగానే కర్నూలులో ఆపరేషన్లు చేస్తామని అధినేత కాంతారెడ్డి తెలిపారు. ఇందుకోసం ఈనెల 24,25,26తేదీల్లో మూడురోజులపాడు తమ జనరల్ హాస్పిటల్‌లో ప్రత్యేకమైన క్యాంప్‌ను నిర్వహించి డోన్‌నుంచి రోగులను తమ వాహనాల్లోనే తీసుకెల్లేందుకుకూడా సౌకర్యాన్ని కల్పించనున్నట్లు ఆయన చెప్పారు. ఇంతమంచి అవకాశాన్ని ఉపయోగించుకునేందుకు విశ్వభారతి యాజమాన్యం తమ పట్టణానికి ఇవ్వడంపట్ల ఛైర్మన్ రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నితీష్‌రెడ్డి, న్యూరాలజిస్టు రోహిత్, డాక్టర్ రవి ఓపి కేంద్రం మెడికల్ సిబ్బంది పివిఆర్ జగన్నాథరావు, రాము, రవి తదితరులు పాల్గొన్నారు.

## వివాహ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు



**దేవనకొండ,మే 21,ప్రభాతవార్త :** మండల పరిధిలోని గద్దెరాళ్ల గ్రామంలో జరిగిన తలారి సంజప్ప,లక్ష్మిల కుమారుడు అశోక్ వివాహ కార్యక్రమానికి మాజీ మంత్రి కెఈ ప్రభాకర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పెళ్లి కార్యక్రమానికి హాజరైన మాజీ మంత్రి కెఈ ప్రభాకర్‌కు డప్పు వాయిద్యాలు,బాణాసంచా పేలుస్తు ఘనస్వాగతం పలికారు. అలాగే మండలంలోని కొంతమంది ప్రముఖులు పెళ్లి కార్యక్రమానికి హాజరవడంతో పెళ్లి అంగరంగ వైభవంగా జరిగింది. ఈ పెళ్లి వేడుకలలో టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్,టిడిపి మండల నాయకులు ఉచ్చీరప్ప,బడిగింజల రంగన్న,ఈదుల దేవరబండ సుభాన్,రాజ శేఖర్‌గౌడ్,మల్లికార్జునగౌడ్,రామారావు నాయుడు,గద్దెరాళ్ల సూరన్న,ఆనంద్ కుమార్,నెట్టేకల్,లక్ష్మన్న,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో స్వగృహంలో మృతి



**పగిడ్యాల, మే 21,ప్రభాతవార్త :** పగిడ్యాల రైతు సంఘం, వైకాపా నాయకులు అదివారం ఉదయం తాతగారి పుల్లారెడ్డి (72) గుండెపోటుతో స్వగృహంలో మృతి చెందారు. మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాలనీలో విషాదచాయలు అలుముకున్నాయి. సమాచారం తెలియడంతో మాజీ జెడ్పీటిసి పుల్యాల నాగిరెడ్డి, మండల టిడిపి నాయకులు బొగ్గుల దామోదరరెడ్డి, ఒగిలి శ్రీనివాసులు, వైకాపా మండల నాయకులు గంగిరెడ్డిగారి చిట్టిరెడ్డి, శ్రీశివానందభారతీస్వామిజీ, మైనార్టీనాయకులు మహబూబ్‌బాష, గ్రామరైతు కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, రాజకీయపార్టీలకు అతీతంగా పుల్యాలరెడ్డి భౌతికాయాన్ని సందర్శించి పూలమాలలువేసి ఘనంగా నివాళ్ళుఅర్పించారు. పుల్యాలరెడ్డి మృతికిసంతాపంతోపాటు కుటుంబభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు.

## రాయితీపై వేరుశనగ విత్తన సరఫరా



**తుగ్గలి,మే 21,ప్రభాతవార్త :** ఖరీఫ్ 2023సంవత్సరానికి 40శాతం రాయితీతో వేరుశనగ విత్తనాలు రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తుందని మండల వ్యవసాయ అధికారి పవన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ విత్తనాలు కావాల్సిన రైతులు రైతుభరోసా కేంద్రాల్లో తమ యొక్క పాస్‌పుస్తకాలు తీసుకెళ్లి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఒక క్వింటానికి పూర్తి ధర రూ.9300లు కాగా ప్రభుత్వం రూ.3720లు రాయితీ ఇస్తుందని రైతు రూ.5580లు చెల్లించి వేరుశనగ విత్తనాలు తీసుకోవాలని కోరారు. అర్ధ ఎకరాకు ఒక విత్తన సంచి,ఒక ఎకరా లోపల ఉంటే 2 విత్తన సంచులు,ఒక ఎకరాపైన ఉంటే 3సంచులు రాయితీపై ఇవ్వడం జరుగుతుందన్నారు. కావాల్సిన రైతులు ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు. రైతులు వారి యొక్క పట్టాదారు పాస్ పుస్తకం,ఆధార్ జిరాక్స్ కాపీ మరియు ఫోన్ నంబర్ తీసుకుని పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

## యువగళంలో జనానికి మజ్జిన ప్యాకెట్లు సరఫరా



**కోవెలకుంట్ల,మే 21,ప్రభాతవార్త :** నారలోకేస్ చేపట్టిన యువగళము పాదయాత్ర అదివారము అమడాల మెట్ట వద్దనుండి సాగగా యాత్రకు వచ్చిన అశేషనానికి మాజీ మార్కెట్ యాడు ఛైర్మన్ గద్దంనాగేశ్వరరెడ్డి మజ్జిగ ప్యాకెట్లును అందించారు. యా త్ర అరంభమైన అమడాల వద్ద నుండి కోవెలకుంట్ల పట్టణం చివరి వరకు గద్దం సోదరులు యాత్రము ముందుగా వాహనాలో మజ్జిన ఏర్పాటు చేసుకుని ప్రజలకు పంపినీ చేస్తు ముందుకు సాగారు. దీనితో యాత్రకు వచ్చిన పొటెత్తిన జనము గద్దం సోదరులకు కృతజ్ఞతలు చెప్పారు.

## యువగళము దెబ్బకు వైసిపి నాయకుల గుండెల్లో గుబులు




**కోవెలకుంట్ల,మే 21,ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా మా యువ నాయకుడు చేపట్టిన యువగళము పాద యాత్రకు వైసిపి నాయకుల గుండెల్లో గుబులు పుట్టుతున్నదని కోవెలకుంట్ల మార్కెట్ యాడు మాజీ చైర్మన్ గద్దం నాగేశ్వరరెడ్డి అన్నారు. అదివారము అమడాల విడిది కేం ద్రము వద్ద లోకేష్‌తో సెల్ఫి దిగిన అనంతరము అయన మాట్లాడుతూ యువగళమే యాత్రము ప్రజా స్పందన విపరీతము వస్తున్నదని ఈ దెబ్బతో వైసిపి దుఖాణం బంద్ చేసుకోవల్సిందే అన్నారు. రోజుకు యాత్ర తీవ్రతము కావడము వైసిపి నాయకులకు దడ పట్టుకుందని చెప్పారు. వచ్చేది తెలుగు దేశం ప్రభుత్వమని వైసిపి నాయకులు అందిరికి అర్థము అయిందని అందుకే వారి వెన్నులో వనుకు పట్టుతున్నదని జోష్యము చెప్పారు.

## ప్రార్థన మందిరం భక్తులది..

# మందిరం ఆస్తి కాపాడండి..

### :- సంఘ పెద్ద పారా సంజప్ప



**మద్దికెర,మే 21,ప్రభాతవార్త :** మద్దికెరలోని క్రిస్టియన్ బ్రదరన్ అసెంబ్లీ ప్రార్థన మందిరం భక్తులది అని మందిరం ఆస్తిని కాపాడండి అని సంఘ పెద్ద పారా సంజప్ప అన్నారు. ఆదివారం సంఘ పెద్ద పారా సంజప్ప మరియు సంఘస్తులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరు గ్రామ నివాసి అయిన కీ.శే దేవపుత్ర కుమారులలో ఒకరైన ఎనుమొద్దుల జయన్న పత్రికలో ఇచ్చిన ప్రకటనపై ఖండన మరియు వివరణ,క్రిస్టియన్ బ్రదరన్ అసెంబ్లీ ప్రార్థన మందిరం 25-08-1968,డోర్ నం.12/4,స.నం 452 (గ్రామ కంఠస్థలమునందు నిర్మించుకుని తదుపరి 12-06-2004లో పెద్దదిగా ఏర్పాటు చేసుకుని గత 50సం॥లుగా ప్రశాంతంగా నడుపుకొనుచుండగా ఈ విషయం సదరు జయన్న 2018లో పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో చర్చి తన తండ్రి దేవపుత్ర నిర్మించినారని కావున వారసత్వరీత్య చర్చి తనకు చెందవలెనని దావా వేసి (ఓఎస్ నం.174/2018)సంఘ పెద్దలు మరికొందరిని జోక్యం చేసుకొనకుండ ఇంజక్షన్ ఇవ్వమని కోరగా సదరు గౌరవ కోర్టు వారు ఇంజక్షన్ పిటిషన్ (ఐ.ఎ.నం.803/2018)ను ఇరువురిని విచారించి ఆధారాలను పరిశీలించి జయన్న వేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ సదరు జయన్న వద్ద ఆధారాలు లేవని చర్చి పాస్టర్ హోదా వారసత్వంగా జయన్నకు రాదని ప్రతివాదులైన ప్రస్తుత సంఘ పెద్ద సంజన్న వద్ద సంబంధిత రికార్డులు మరియు ఆధారాలు ఉన్నాయని చర్చి పారా సంజప్ప స్వాధీనానుభవములో ఉన్నట్లుగా నిర్థారించి 16-4-2019న డిస్మిసల్ ఆర్డర్ ఇవ్వడమైందన్నారు. పిటిషన్ డిస్మిస్ అయిన తరువాత సదరు జయన్న రెవెన్యూ అధికారులు తనకు 4-5-2005న ఆర్‌సి నం.164/2004 ద్వారా స.నం 452నందు 9.89 సెంట్లు ఖాళీ స్థలం తన పేరిట చర్చి నిమిత్తం పట్టా మంజూరు చేసినట్లుగా పట్టాను తయారు చేసుకుని ఏపి హైకోర్టులో రిట్ పిటిషన్ డబ్ల్యుపి నం.19111/2019 26-11-2019న దాఖలు చేసి సంఘ పెద్ద సంజన్న మరియు ఇమ్మానియేలు,రెవెన్యూ అధికారులు చర్చి విషయంగా జోక్యం చేసుకోరాదని దాఖలు చేసినాడన్నారు. పట్టా విషయమై ఆర్‌టిఐ ద్వారా సంఘ పెద్ద సంజన్న మరియు తన అడ్వకేట్ పట్టా యొక్క నకలు కోరగా అప్పటి డిప్యూటీ తహశీల్దార్,తహశీల్దార్‌లు వారి కార్యాలయం నుండి సదరు పట్టా మంజూరు కాలేదని ప్రొసీడింగ్స్ ఇవ్వడం జరిగిందన్నారు. (ఆర్‌సిసి 147/2019,10-2-2020) తర్వాత జయన్న కుమారుడు డిప్యూటీ తహశీల్దార్ ఏజాజ్ అహమ్మద్ సహకారంతో సదరు పట్టా వారి కార్యాలయంలో ఉన్నట్లుగా తెలుపుతూ ప్రొసిడింగ్స్ ఆర్‌సిసి 67/2021,27-4-2021న పొంది హైకోర్టు నందు డబ్ల్యుపి 12443/2021 28-6-2021న దాఖలు చేయగా సదరు డబ్ల్యుపిని డిస్మిస్ చేసి కర్నూలు జిల్లా కలెక్టరు వారికి విచారించి చర్యలు తీసుకోమని 8-9-2022న ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందన్నారు. దీనిపై కలెక్టర్ ఇరుపక్షాలను విచారించి జయన్నకు మద్దికెర చర్చికి ఎటువంటి సంబంధం లేదని, 1968నుండి చర్చి ఉన్నందున 2005లో జయన్నకు ఖాళీ స్థలం కొరకు పట్టా ఇచ్చినారనేది సక్రమంగా లేదని బోగస్ అని ఈ విషయంలో పత్తికొండ ఆర్‌డిఓని చర్య తీసుకోమని 3-4-2023న ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందన్నారు. మరల జయన్న కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టును ఆశ్రయించి స్టేస్కోను తెచ్చుకున్నాడన్నారు. అయితే ఇప్పటివరకు ఏ కోర్టు వారు కూడా జయన్న మద్దికెర చర్చినందు పొజిషన్‌లో ఉన్నట్లుగా ధృవీకరించలేదని అయితే పత్తికొండ కోర్టు వారు చర్చి సంజన్న స్వాధీనానుభవములో ఉన్నదని నిర్థారించినందున డబ్ల్యుపి.9837/2023నందు ఇచ్చిన స్టేటస్‌కో ప్రకారం మందిరం సంజన్న స్వాధీనంలేనే ఉన్నది అయితే జయన్న చర్చి విషయంగా కోర్టు వారు తనకు ఉత్తర్వులు ఇచ్చినారని తప్పుడు ప్రచారం చేస్తూ అధికారులు,కోర్టువారిని,ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నాడన్నారు. 50సం॥లుగా ప్రార్థన మందిరంను అక్రమంగా ఆక్రమించుకొనుటకై జయన్న మరియు వారి కుటుంబ సభ్యులు చేస్తున్న దౌర్జన్యమును పలుమార్లు పోలీస్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడమైందన్నారు. గత 50ఏళ్లుగా చర్చి ఎన్నడూ మూతబడలేదని అయితే జయన్న కారణంగా పోలీసు వారు గత రెండు ఆదివారాలు(ఈ నెల 7,14వ తేదీల్లో) తాళం వేయడం జరిగిందన్నారు. సదరు స్థలం,ఆస్థిని కబ్జా చేయుటకు జయన్న రెవెన్యూ, న్యాయశాఖ,పోలీస్,మీడియాను తప్పుదోవ పట్టిస్తూ చాలా ఇబ్బందికరమైన వాతావరణాన్ని సృష్టిస్తున్న జయన్న,అతని కుటుంబ సభ్యులపై తగిన చర్యలు తీసుకుని మందిర ఆస్తులను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పారా భాస్కర్,ఇన్మాయిల్,ఇమాములు,రాజేంద్ర,రాజేష్, తదితరులున్నారు.

## విధుల నిర్వహణలో ఆలసత్వాన్ని వీడనాడాలి



**ప్యాపిలి మే21(ప్రభాతవార్త):** విధుల నిర్వహణలో ఆలసత్వాన్ని వీడనాడాలని డోన్ డిఎస్పీ వ్రి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్యాపిలి పట్టణంలో నూతనంగా నిర్మించి సర్కిల్ కార్యాలయ భవనాన్ని ఆదివారం డిఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది చేస్తున్న సేవలను అభినందనీయమని పేర్కొన్నారు. పోలీసుస్టేషన్‌ను సొంత ఇంటి మాదిరిగా సిబ్బంది చూసుకోవాలని సూచించారు. సర్కిల్ కార్యాలయ ఆవరణలో చెట్లను పెంచాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కోరారు. పోలీసుస్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే వారిపట్ల మర్యాదగా వ్యవహరించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు కేసులను పరిష్కరించాలని సూచించారు. విధులతో పాటు ఆరోగ్యాన్ని కూడ సిబ్బంది కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్యాపిలి సిఐ శ్రీరాములు, బేతంచెర్ల సిఐ ప్రియతమ్‌రెడ్డి, ఎస్సై రాకేష్, వైకాపా నాయకులు మెట్టుపల్లె వెంకటేశ్వరరెడ్డి, బోరెడ్డి పుల్లారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ బోరా మల్లికార్జునరెడ్డి, ఉప సర్పంచ్ గద్దం భువనేశ్వరరెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ బోరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.